క్లుప్తంగా

చంద్రారెడ్డికి నివాళి



మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన కడారి చంద్రారెడ్డి(84) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి భౌతికకాయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కడారి యాదవరెడ్డి, గుండగాని అంబయ్య గౌడ్, జీడి భిక్షం, సురేందర్‌రెడ్డి, దోమల బాలమల్లు, గుంటకండ్ల ముకుందారెడ్డి, కూరం వెంకన్న, చిప్పలపల్లి రాములు, ఎలుక సైదులు, అనంతుల మల్లయ్య, సూరిబాబు, పాశం మధుసూదన్‌రెడ్డి, బాలస్వామి, ఉపేందర్, మురళీ, పండు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

తుంగతుర్తి : మండలంలో రెండు రోజుల పాటు మిషన్‌భగీరథ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మిషన్‌భగీరథ ఏఈఈ అశోక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతనకల్ మండలం చిల్పకుంట్లలో ఉన్న మిషన్‌భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో ఫిల్టర్ బెడ్స్ మరమ్మతుల కారణంగా ఈ నెల 20, 21 తేదీల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మిషన్‌భగీరథ నీటి శుద్ధి కేంద్రం పరిధిలోని 168 గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

నూతనకల్ : చిల్పకుంట్ల నీటిశుద్ధి కేంద్రం పరిధిలో రెండు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. అశోక్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నీటిశుద్ధి కేంద్రంలోని క్లారిస్లాకులేటర్, ఫిల్టర్ బెడ్స్ శుభ్రపర్చడం వల్ల నీటి సరఫరా నిలివేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22న నీటి సరఫరా పునరుద్ధరించబడుతుందని పేర్కొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



దోసపహాడ్‌లో శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ ఆధ్వర్యంలో గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఆబోతుకు అంత్యక్రియలు

చివ్వెంల : ప్రమాదవశాత్తు ఆటో ఢీకొని మృతి చెందిన ఆబోతుకు గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సంఘటన పులితండాలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలో గత కొద్ది సంవత్సరాలుగా ఉంటున్న ఆబోతు ఆదివారం ఆటో ఢీకొట్టడంతో మృతి చెందింది. ఆబోతును గ్రామ దైవంగా భావించిన తండావాసులు దానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ శివారులో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధరావతు వీరన్న, ఉప సర్పంచ్ లచ్చి, ధరావతు వెంకన్న, బీక్యా, వేము, లింగా, రవి, నాగు, రమేష్, సాగర్, బాలు, లోక్యా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నడిగూడెం : కోదాడలోని పెరిక భవన్‌లో ఈ నెల 25న కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పలువురు శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ మెగా జాబ్ మేళా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా 72 కంపెనీలకు చెందిన ప్రతినిధులు వస్తున్నారని, విద్యార్హతను బట్టి ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. కార్యక్రమంలో దున్నా ప్రవీణ్ కుమార్, నోసిన రవి, సాయి, పందిటి వంశీ, కరుణాకర్, సతీష్, సందీప్, మల్లిఖార్జున్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు మరో కేంద్రం

- నాగారం సబ్‌డివిజన్‌కు ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ సెంటర్ మంజూరు
- అర్వపల్లిలో కొనసాగుతున్న కేంద్రం తుంగతుర్తికి తరలింపు
- నియోజకవర్గంలో రెండుకు చేరిన మరమ్మతు కేంద్రాలు



అర్వపల్లి సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం



అర్వపల్లి సబ్‌స్టేషన్‌లో కొత్తగా నిర్మిస్తున్న మరమ్మతు కేంద్రం షెడ్

అర్వపల్లి : వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కొత్తగా నాగారం సబ్‌డివిజన్‌కు మరమ్మతు కేంద్రాన్ని మంజూరు చేసింది. అయితే తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి గతంలో మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని 1999లో నియోజకవర్గంలోని రైతులందరికీ అందుబాటులో ఉండే విధంగా అర్వపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. అప్పట్లో విద్యుత్ సిబ్బంది క్వార్టర్స్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఇప్పటివరకు అందులోనే నడుస్తోంది. ఈ మరమ్మతు కేంద్రానికి నియోజకవర్గంలోని తుంగతుర్తి, తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల, నాగారం, జాజిరెడ్డిగూడెం మండలాల రైతులు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లను తీసుకొచ్చి మరమ్మతు చేయించుకుంటున్నారు. కాగా నూతనకల్, మద్దిరాల, తుంగతుర్తి మండలాల రైతులకు ఇక్కడికి ట్రాన్స్‌ఫార్మర్‌లు తేవడానికి దూరం అవుతుండటంతో తాజాగా ప్రభుత్వం మరో మరమ్మతు కేంద్రాన్ని మంజూరు చేసింది.

నాగారం సబ్‌డివిజన్‌కు కొత్తగా..

కొత్తగా ఏర్పడిన నాగారం సబ్‌డివిజన్‌కు ప్రభుత్వం కొత్త మరమ్మతు కేంద్రాన్ని మంజూరు చేసింది. దీంతో అర్వపల్లిలో ఉన్న పాత మరమ్మతు కేంద్రాన్ని తుంగతుర్తికి మార్చాలని విద్యుత్‌శాఖ నిర్ణయించింది. కొత్తగా మంజూరైన మరమ్మతు కేంద్రాన్ని అర్వపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. తుంగతుర్తిలో ఏర్పాటు చేయబోయే మరమ్మతు కేంద్రం పరిధిలో తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేయించుకోవాల్సి ఉంటుంది. అర్వపల్లిలో ఏర్పాటు చేస్తున్న కేంద్రం తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం మండల రైతులకు సేవలందిస్తుంది. దీంతో రైతుల ఇబ్బందులు తీరనున్నాయి. కాగా నియోజకవర్గంలోని 6మండలాలకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌లు నెలకు సుమారుగా 30వరకు మరమ్మతుకు వస్తున్నాయి. అయితే అర్వపల్లిలో కొత్తగా ఏర్పాటు చేసే మరమ్మతు కేంద్రానికి సాయిరాం ఎలక్ట్రికల్స్ కంపెనీ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఈ కంపెనీవారు మరమ్మతు కేంద్రాన్ని నిర్వహించనున్నారు. ఈ కేంద్రం నిర్వహణను కంపెనీ సూపర్‌వైజర్, డిస్కం లైన్‌మెన్ ఇద్దరు పర్యవేక్షిస్తారు.

రైతుల ఇబ్బందులు తీర్చడానికే కొత్త కేంద్రం



రైతుల ఇబ్బందులను తీర్చడానికి ప్రభుత్వం కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న రైతులకు దూర భారం, ఖర్చులు తగ్గనున్నాయి.

- గుండగాని సోమేష్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు

నూతన కేంద్రం పనులు జరుగుతున్నాయి



అర్వపల్లిలో ఉన్న పాత మరమ్మతు కేంద్రం త్వరలో తుంగతుర్తికి మారనుంది. కాగా నాగారం సబ్‌డివిజన్‌కు కొత్తగా మంజూరైన మరమ్మతు కేంద్రం అర్వపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు కానుంది. ఇందుకోసం షెడ్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. నాగారం, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం మండలాల రైతులు ఈ కొత్త కేంద్రాన్ని వినియోగించుకోవాలి.

- వి.శ్రీకాంత్, ఏఈఈ

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్



దివ్యాంగ యువకుడికి ఆర్థికసాయం అందిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి మిగులు బడ్జెట్ గల రాష్ట్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. తాను చేపట్టిన పాదయాత్రను ఆదివారం 11వ రోజు ఆత్మకూరు, ఏనుబాముల గ్రామాల్లో కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశాడన్నారు. గత 9 సంవత్సరాల పాలనలో అన్ని వర్గాల ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కొత్తగా రేషన్ కార్డులు, పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లేక నిరుపేదలు ఇబ్బదులు పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఏనుబాముల గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ కలకోట్ల పార్వతమ్మ దివ్యాంగ కుమారుడు శంభయ్యకు రమేష్ రెడ్డి ఆర్థికసాయం అందించారు. ఆదివారం పటేల్ రమేష్ రెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆత్మకూరులో అభిమానులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో చిలుముల గోపాల్ రెడ్డి, స్వామి నాయుడు, షఫీ ఉల్లా, దండా అరవింద్ రెడ్డి, మల్సూర్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగయ్య, మర్ల కర్ణాకర్ రెడ్డి, ఎస్‌కే సైదులు, లక్ష్మీనర్సు, చంద్రయ్య, షఫీ, శ్రీనివాస్, జానయ్య తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'పై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాతా సభ్యులు

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమంపై కళాజాతా బృందం సభ్యులు ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామంలో ఈ నెల 22న నిర్వహించే కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కంటివెలుగు ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్, కార్యదర్శి జంపాల శ్రీనివాస్, కృష్ణ, వేసురెడ్డి, ఆశలు, అంగన్‌వాడీలు, జీపీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



సీడ్ బాల్స్ చూపుతున్న నిర్వాహకులు

అర్వపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూర్యక్షేత్రం వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి కోరారు. నల్లగొండ సీడ్ బాల్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో తిమ్మాపురంలోని సూర్యక్షేత్రం సమీపంలో ఉన్న గుట్టలపై సీడ్ బాల్స్ చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణం దెబ్బతినడం వల్ల రోజురోజుకూ ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్నాయని చెప్పారు. ఇందుకు టర్కీ, మరికొన్ని దేశాల్లో సంభవిస్తున్న భూకంపాలే నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై భక్తులకు అవగాహన కల్పించారు. అనంతరం గుట్టలపై సీడ్‌బాల్స్ వదిలారు. ఈ సీడ్స్‌తో మొక్కలు పెరిగి వృక్షాలుగా మారనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్‌బాల్స్ విద్యార్థులు చలోజు జశ్వంత్, దీక్షిత, హరీందర్, భక్తులు గనపురం నరేష్, జైపాల్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

ఆటోమెటిక్ స్టార్టర్ల తొలగింపు



తిరుమలగిరిలో ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించిన విద్యుత్ సిబ్బంది

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురంలో వ్యవసాయ విద్యుత్ మోటార్లకు బిగించిన ఆటోమెటిక్ స్టార్టర్లను విద్యుత్ అధికారులు ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడారు. ఆటోమేటిక్ స్టార్టర్ల కారణంగా రైతులకు నీరు అవసరం లేకున్నా ఆటోమెటిక్ స్విచ్ వేసి ఉండటం వల్ల విద్యుత్ వృథా అవుతుందని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించామని అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ ఇస్తారి, లైన్‌మెన్లు ఎల్లయ్య, బుచ్చిమల్లు, మధు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు మార్గదర్శులు కావాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఎంఈఓ బందు కృష్ణయ్య



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నూతనకల్ : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకొని భావితరాలకు మార్గదర్శకులుగా నిలవాలని రిటైర్డ్ ఎంఈఓ బందు కృష్ణయ్య అన్నారు. ఆదివారం నూతనకల్ మండల కేంద్రంలోని ఎంపీహెచ్‌ఏ(ఎం) ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, సమత పారామెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో పారామెడికల్ కళాశాలలను స్థాపించి విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఎంపిక చేసుకున్న వివిధ టెక్నికల్ కోర్సుల్లో రాణించాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ నాగుల్‌మీరా, కరస్పాండెంట్ షేక్ సజ్జునాగుల్‌వీరా, సాబాది వెంకట్‌రెడ్డి, పొదిల వెంకటయ్య, బత్తుల విజయ్‌కుమార్, జటంగి కృష్ణ, శ్రీనివాస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

సూర్యాపేట : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంతటి విజయ్ ఫంక్షన్ హాల్‌లో తన తండ్రి అనుములపురి నర్సయ్య జ్ఞాపకార్థం పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యపరీక్షలను ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో షుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీసంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెండెం చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ చంద్ర, పద్మశాలీ సంఘం యువజన అధ్యక్షుడు మిట్టకోల యుగంధర్, కడారి సతీష్ యాదవ్, దశరథ, మధు, దూలం నగేష్, రేణుబాబు, పున్న వెంకన్న, జగదీష్, ఉపేందర్, అపోలో డయాగ్నస్టిక్స్ సెంటర్ నిర్వాహకులు రాపోలు సంతోష్, గంజి రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్టు



ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న డాక్టర్ సుధీర్‌కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు

సూర్యాపేటటౌన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం కోసం టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని ప్రముఖ వైద్యుడు డాక్టర్ దాచేపల్లి సుధీర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సిటి టాలెంట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రశ్నపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. తాను విద్యనభ్యసించే సమయంలో టాలెంట్ టెస్ట్‌లు తన ఉన్నతికి ఉపయోగపడ్డాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, శ్రీకాంత్‌వర్మ, ప్రిన్సిపల్ మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వారబందీతో రైతులకు నష్టం

అర్వపల్లి : వారబందీ విధానంతో రైతులకు నష్టం వాటిల్లుతుందని, జిల్లాకు గోదావరి జలాలను నిరంతరాయంగా వదలాలని సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్దా సత్యనారాయణ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గోదావరి జలాలపై ఆధారపడి వేలాది ఎకరాల పంటలను రైతులను సాగు చేశారని చెప్పారు. వారబందీ విధానంలో నీటిని ఇస్తుండటంతో ఎండల మూలంగా పంటలకు నీళ్లు చాలక ఎండిపోతున్నాయని తెలిపారు.

ఘనంగా పార్వతీపరమేశ్వరుల కళ్యాణం



తుంగతుర్తి : గానుగుబండలో స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్‌రావు



అర్వపల్లి : ఉమామహేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తుంగతుర్తి : మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని శనివారం రాత్రి మండల పరిధిలోని కొత్తగూడెం, గానుగుబండ గ్రామాల్లో శివపార్వతుల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గానుగుబండలోని కనకదుర్గ ఆలయంలో నిర్వహించిన శివపార్వతుల కళ్యాణానికి జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్‌రావు, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకెళ్లి దేవతామూర్తులకు సమర్పించారు. అలాగే కొత్తగూడెంలోని శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ దోనకొండ సంధ్యరమేష్‌లు దేవతామూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించారు. వేడుకల్లో సర్పంచ్ గుజ్జ పూలమ్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి అర్వపల్లి శివారులోని చిన్నగుట్టపై ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం అన్నపూజ జరిపారు. అలాగే పర్సాయపల్లి శివారులోని గుట్టపై ఉన్న శ్రీభవానీసమేత జంగమేశ్వరాలయంలో రాత్రి కల్యాణాన్ని నిర్వహించారు. కొమ్మాలలో పార్వతీపరమేశ్వర ఆలయం నందు జలాభిషేకం జరిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ గంగదెరి వెంకటమ్మ, ఉపసర్పంచ్ కుంట్ల రేణుక, గంగదెరి శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, వీరభద్రం, గోళ్ల వెంకటేశ్వర్లు, పులిచర్ల మల్లికార్జున్, నరహరి, శివరాంచంద్, కృష్ణమూర్తి, యోగి, ప్రభు, అర్చకులు శివప్రసాద్‌శర్మ, రాజుశర్మ, సాయిరాం, భక్తులు పాల్గొన్నారు.

నాగారం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వర్ధమానుకోటలోని ఏకాంబేశ్వరస్వామి ఆలయంలో, నాగారం, పసునూర్, ఫణిగిరి, ఈటూరు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు శనివారం రాత్రి శివపార్వతుల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో అర్చకులు కాశీ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు బోయిని శోభలింగమల్లు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని స్వయంభు శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో వేద పండితులు ఆమంచి అనంతరామశాస్త్రి, అర్చకులు రాజోలు రమేష్ శర్మ, ప్రసాద్ శర్మ, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ.రజాక్, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, ఆలయ చైర్మన్ ఎల్లు శివారెడ్డి, రావుల వెంకన్న, వడ్డాణం మధుసూదన్, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సుంచు అవిలయ్య, తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : జలాల్‌పురం మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ ముత్తినేని సత్యం, సభ్యులు వేముల దేవయ్య, చెవుగోని శ్రీను, కొమ్ము ఉపేంద్ర, ముద్దసాని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

పెన్‌పహాడ్ : నాగులపహాడ్‌లోని శ్రీ త్రికూటేశ్వర ఆలయంలో మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా శివ పార్వతులకు అర్చకులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలను ఎంపీపీ నెమ్మాది భిక్షం ప్రారంభించారు. అదే విధంగా నంద్యాల రవికిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సంకరమద్ది నిరంజన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్‌లు రాయిలి లక్ష్మి, మండలి మల్లయ్య, దొంగరి సుధాకర్, కొండా జానకిరాములుగౌడ్, అనంతుల శ్రీనివాస్‌గౌడ్, ఒగ్గ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల ఊరేగింపు

మండల పరిధిలోని అనంతారంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శివపార్వతుల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు బచ్చుపల్లి కమలమ్మ జ్ఞాపకార్థం కుమారులు బచ్చుపల్లి నాగేశ్వర్‌రావు, దయాకర్‌రావులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మామిడి రేవతిపరందాములు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుగ్గె కోటయ్య, చిట్టిపు నారాయణరెడ్డి, పానుగోటి సంపత్‌రావు, సామ బుచ్చిరెడ్డి, మామిడి వెంకటయ్య, మామిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.



తిరుమలగిరి : జలాల్‌పురంలో కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



నాగారం : వర్ధమానుకోటలో శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పెన్‌పహాడ్ : నాగులపహాడ్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం



పెన్‌పహాడ్ : అనంతారంలో అన్నదానం ప్రారంభిస్తున్న దాత బచ్చుపల్లి నాగేశ్వర్‌రావు

తోటి స్నేహితుల ఆర్థికసాయం

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన మత్స్య కార్మికుడు గద్దగూటి తులసీదాస్ ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో ఆయనతో చదువుకున్న 1990–91 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మృతుడి భార్య విజయకు రూ.35వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు తూము శ్రీను, బడుగుల సైదులు, సోలిపురం కన్నారెడ్డి, గుండా శ్రీను, అంకిరెడ్డి రాజారాములు, అంకిరెడ్డి ముత్తయ్య, కె.రవీందర్, ఏ.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భగత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో..

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని వెంకెపల్లి గ్రామానికి చెందిన శెనగల పద్మ ఇటీవల మృతి చెందడంతో భగత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా భగత్ యూత్ క్లబ్ అధ్యక్షుడు మండలి సతీష్ మాట్లాడారు. యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 25వేల రూపాయల నగదును మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భగత్ యూత్ క్లబ్ సభ్యులు కుంట పవన్‌రెడ్డి, సదానందచారి, శ్యాంసుందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మురళీ, ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి, హన్మంతు, రవి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : బొల్లంపల్లి గ్రామంలో ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



నూతనకల్ : ఆర్థికసాయం అందజేస్తున్న భగత్ యూత్ క్లబ్ సభ్యులు

మెరుగైన వైద్యం అందించాలి



విద్యార్థులను పరామర్శిస్తున్న సంకినేని

సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని భవిత జూనియర్ కళాశాలలో మెట్లు కూలిన ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆదివారం ఆయన పరామర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి తీసుకెళ్లిన విద్యార్థులకు అర్ధగంట వరకు చికిత్స అందించపోవడం దారుణమన్నారు. జిల్లా కేంద్రం మెడికల్ కళాశాల నిర్మించామని మంత్రి గొప్పలు చెప్పుకుంటున్నారని, 12 మంది విద్యార్థులకు గాయాలైతే ఆస్పత్రిలో మాత్రం కిటికీకి గ్లూకోజ్ బాటిల్స్ కట్టి ఎక్కించే దుస్థితి నెలకొందన్నారు.